క్లుప్తంగా

లేగదూడలపై కుక్కల దాడులు



కుక్కల దాడిలో గాయపడిన లేగదూడ

సీతానగరం: చినకొండేపూడిలో లేగదూడలపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. రాత్రి సమయంలో పశువుల పాకల్లోకి వెళ్లి లేగదూడలను కొరికేస్తున్నాయి. కాళ్లు, తొడలపై కండను లాగేస్తున్నాయి. ఈ విధంగానే కోనే సుబ్బారావు, చిక్కిరెడ్డి ప్రభాకరరావు, కోటి వీర్రాజు, మేడిశెట్టి కోటియ్యకు చెందిన లేగ దూడలపై రాత్రి సమయంలో దాడి చేసి గాయపర్చాయి. అధికారులు స్పందించి, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డ్రోన్‌తో భూసర్వేకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పాపారావు

మధురపూడి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ పథకంలో భాగంగా డ్రోన్ ద్వారా భూసర్వే చేయడానికి సన్నద్ధం కావాలని తహసీల్దార్ పాపారావు అన్నారు. ఈ మేరకు బుధవారం కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాలులో వీఆర్వో, సర్వేయరు, సచివాలయం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలంగట్ల వారీగా వీడియోలు తీసి, వాటి ఆధారంగా మ్యాప్ తయారుచేయాలన్నారు. తద్వారా రైతుకు భూహక్కును నిర్ధారిస్తామన్నారు. మండలంలోని గాడాల, మధురపూడి గ్రామాల్లో గురువారం డ్రోన్ సర్వే జరుగుతుందన్నారు. ఇందుకు విమానాశ్రయం అధికారులు అనుమతి ఇచ్చారన్నారు. ఉదయం 9 నుంచి 11, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సత్యలక్ష్మి కుమారి, మండల డిప్యూటీ సర్వేయర్ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు సమీపంలోని మైదానంలో క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో బుధవారం నాటికి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. శుక్రవారం ఫైనల్స్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఏడిద పండు, పిల్లి క్రాంతి, కుందేటి కిషోర్, బత్తిన నాని, పిల్లి సుధీర్ తెలిపారు. బుధవారం జరిగిన పోటీల్లో గాదరాడపై నిడిగట్ల, గాడాలపై కోరుకొండ, కోలమూరుపై తోకాడ, బూరుగుపూడిపై గుమ్మళ్లదొడ్డి జట్లు విజయం సాధించాయి.

పరీక్షా కేంద్రం పరిశీలన



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సత్యనారాయణ రాజు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు బుధవారం పరిశీలించారు. పరీక్షా కేంద్రం చీఫ్ షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 194 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 178 మంది పరీక్ష రాశారన్నారు.

కంప్యూటర్ కోడింగ్, జావా కోర్సుల్లో శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోడింగ్, జావా కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. దివాన్‌చెరువులోని కార్యాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయని నిర్వాహకులు సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని

సీతానగరం: ఉపాధి హామీ పథకం సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో కె.రమేష్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి పనికి 2,500 మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ బడ్జెట్ నూరుశాతం లక్ష్యం చేరుకోవాలన్నారు. హౌసింగ్‌లో 90 పని దినాలు లబ్ధిదారులకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగశేషవేణి, జూనియర్ ఇంజినీర్ అంజలి కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ చక్రవర్తి, సీవోలు మోహిద్దీన్, లక్ష్మణరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి విస్తరణ

- రూ.70 కోట్లతో రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు అభివృద్ధి
- ఆగస్టు నాటికి పూర్తయ్యేలా చర్యలు



మునికూడలి వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచనల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ ఆగస్టు నాటికి వాహన రాకపోకలకు అనువుగా రోడ్డును తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు. గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమైన రోడ్డుతో ఇబ్బందులు పడిన మండల ప్రజలకు.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా నాలుగు లైన్‌ల రోడ్డు విస్తరణ పనులతో భరోసా లభించింది.

నిధుల మంజూరు

వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తక్షణమే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నాలుగు లైన్‌ల రోడ్డుకు రూ.70 కోట్ల నిధులు రాబట్టి పనులు చేపట్టారు. కాతేరు నుంచి సీతానగరం వరకు 18.2 కిలోమీటర్ల పొడవున నాలుగు లైన్ల రోడ్డుకు అంచనా విలువ రూ.70 కోట్లు కాగా, మరో రూ.35 కోట్లు అవసరమవుతుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. ముఖ్యమంత్రితో జగన్‌తో చర్చించారు. కాతేరు నుంచి సీతానగరం వరకు గ్రామాల వద్ద సిమెంట్ డ్రైన్లు ఏర్పాటు చేసి, సిమెంట్ రోడ్డులు వేస్తారు. ఈ విధంగా సిమెంట్ రోడ్డు 10.5 కిలోమీటర్లు ఉంటుంది. కాతేరు నుంచి సీతానగరం వరకు పలు గ్రామాల వద్ద 14 కల్వర్టులు ఏర్పాటు చేయాలి. ఇప్పటి కొన్ని పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకట నగరం, అలాగే బొబ్బిల్లంక వద్ద బ్రిడ్జిలు నిర్మించాలి. కాతేరు నుంచి సీతానగరం వరకు రోడ్డు విస్తరణకు పలు గ్రామాల వద్ద 13 ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది.

రోడ్డు మధ్యలో డివైడర్ల ఏర్పాటు

సిమెంట్ రోడ్డు నిర్మించిన గ్రామాల్లో అడుగున్నర వెడల్పుతో సిమెంట్ దిమ్మలను డివైడర్లుగా ఏర్పాటు చేస్తారు. తారురోడ్డు ఉన్న ప్రాంతంలో డివైడర్లుగా తొమ్మిది అంగుళాల ఎత్తు సిమెంట్‌తో కట్టి మధ్యలో నాలుగు అడుగులలో మట్టి వేసి, మొక్కలను పెంచుతారు. అధిక వర్షాల వలన రోడ్డు పనులు నెమ్మదించడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. అయితే ఆగస్టు నాటికి వాహన రాకపోకలకు అనువుగా రోడ్డును తీర్చిదిద్దుతారు.

ఎమ్మెల్యే రాజా కృషి



రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్లు రోడ్డుగా అభివృద్ధి చేయడం మండల ప్రజల అదృష్టం. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితోనే ఇది సాధ్యమైంది. వర్షాల వల్ల పనులు నెమ్మదించినా, రాకపోకలలో ఇబ్బందులు కలిగినా ప్రజలు సహకరించారు. త్వరలో వాహన రాకపోకలకు అనువుగా రోడ్డు పూర్తవుతుంది.

– మద్దాల కొండలరావు, సీతానగరం

రాకపోకలు సులభం



రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తక్షణమే ముఖ్యమంత్రి జగన్‌తో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చర్చించి, రూ.70 కోట్లు మంజూరు చేయించారు. రాబోవు రోజుల్లో ఈ రోడ్డుపై ప్రయాణం చాలా సుఖవంతంగా ఉంటుంది.

– ఘంటా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన



బోరుకు శంకుస్థాపన చేసిన గ్రామ పెద్దలు, తూర్పుకాపు, వెలమ సంఘం నాయకులు

గోకవరం: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న కమ్యూనిటీ భవనం వద్ద బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తూర్పు కాపు, వెలమ సంఘాలకు కేటాయించారు. ఆ భవనం అభివృద్ధికి ఇరు సంఘాల సభ్యులు చర్యలు చేపట్టారు. పంచాయతీ నిధులతో బుధవారం అక్కడ బోరుకు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నుంచి రూ. 5 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగలు ప్రకటించగా తన తల్లి సుంకర సావిత్రి జ్ఞాపకార్థం రూ.లక్షను వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ప్రకటించారు. మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు తమ్మన్నదొర, దాసరి చినబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బోసుబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

అనపర్తి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షల్లో తొలిరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. మండలంలోని లక్ష్మీనరసాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల, అనపర్తి శివారు కొత్తూరులో గల డాక్టర్ అంబేడ్కర్ సెంటనరీ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలో మొత్తం రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షలకు అనుమతించరాదనే నిబంధన ఉండడంతో చాలా మంది విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. కొంచెం ఆలస్యమైన విద్యార్థులు ఉరుకులు, పరుగుల మీద కేంద్రాలకు చేరుకుని పరీక్షలకు హాజరయ్యారు.



కొత్తూరు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ నరసింహం

28 మంది గైర్హాజరు

మండల పరిధిలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు మొత్తం 28 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కొత్తూరు పరీక్షా కేంద్రంలో 487 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 472 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని, 15 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ విజయ్ తెలిపారు. లక్ష్మీనరసాపురం పరీక్షా కేంద్రంలో 486 మంది విద్యార్థులకు గాను 473 మంది మాత్రమే హాజరయ్యారని 13 గురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని అధికారులు తెలిపారు. లక్ష్మీనరసాపురం పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ కె.శశిధర్, కొత్తూరులో పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ బీఎల్ నరసింహంలు తనిఖీ చేశారు.

తొలిరోజు 32 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, ఒకేషనల్ జీఎఫ్సీ పరీక్షలు నిర్వహించినట్లు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు కేవీ రామకృష్ణ, సీహెచ్ఏ శిరీష తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మొత్తం 270 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 253 మంది విద్యార్థులు మాత్రమే వచ్చారు. 17 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో మొత్తం 266 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 251 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 15 మంది గైర్హాజరయ్యారు. తహసీల్దార్ వాకాడ అమ్మాజీ, సిట్టింగ్ స్క్వాడ్ జి.శ్యామల, వి.ఠాగూర్‌కుమార్, స్టేట్ అబ్జర్వర్ అరుణలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సెకండ్‌లాంగ్వేజ్ పేపర్–2 పరీక్ష జరుగుతుందని చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

1500 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని లయన్స్ క్లబ్ అధ్వర్యంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇప్పటి వరకు 1500 పూర్తయ్యాయని క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు గత నెల రోజులుగా జి.మామిడాడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 3000 మందికి పరీక్షలు చేయాలనేది లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 1500 పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి యువరాజారెడ్డి, క్లబ్ ప్రతినిధులు ఆర్.ఎ.ఆర్.కె. చౌదరి, పప్పు రామకృష్ణారెడ్డి, రాయుడు, ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

గోకవరం: తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. రాజమహేంద్రవరం దేవాదాయశాఖ అధికారి పర్యవేక్షణలో లెక్కింపు ఉంటుందన్నారు. అయితే ఈ లెక్కింపును అడ్డుకుంటామని దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి) ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల భక్తులు హుండీలో వేస్తున్న డబ్బుల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని, విచారణ నిర్వహించాలని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని ఈఓ హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు ట్రస్టు బోర్డు తీర్మానం లేకుండా హుండీలను తెరిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారన్నారు. అక్రమాలపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకున్న తరువాతే హుండీలను తెరవాలన్నారు.

పద్మాలయలో గణ చిత్ర ఆవిష్కరణ

- 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల



గణ చిత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో విజయ్‌కృష్ణ, ఎన్.బుచ్చిరెడ్డి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక మెయిన్‌రోడ్డులోని పద్మాలయ స్టూడియోలో యువ నటుడు విజయ్‌కృష్ణ నటించిన గణ చిత్ర బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విజయ్‌కృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా గణ చిత్రాన్ని నిర్మించామని తెలిపారు. ఈనెల 17న ప్రపంచవ్యాప్తంగా 400 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. నాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాకినాడకు చెందిన ఎంతో మంది చిత్ర పరిశ్రమలోకి వెళ్లి ఖ్యాతి గడించారన్నారు. అందువల్లనే కాకినాడలో ఈ చిత్ర ముందస్తు వేడుక చేస్తున్నామని అన్నారు. చిత్ర హీరో విజయ్‌కృష్ణ స్వయంగా కథ తయారు చేసుకుని స్వీయ దర్శకత్వంలో చిత్రాన్ని నిర్మించారని నిర్మాతలు సాయి కృష్ణారెడ్డి, ఎన్.బుచ్చిరెడ్డి, బాలప్రసాద్‌లు అన్నారు. ఎక్కడా డూప్ లేకుండా రిస్క్ తీసుకుని ఆయన నటించారని తెలిపారు. మూడున్నర కోట్ల రూపాయలతో ఎంతో నాణ్యత ప్రమాణాలతో చిత్రాన్ని నిర్మించామని, హీరోయిన్లు సుకన్య, తేజులు మంచిగా నటించారన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా చిత్రం సాగుతుందని అన్నారు. ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించలనీ కోరారు. చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన వైఎస్సార్‌సీపీ మండల, అనుబంధ కమిటీ ప్రతినిధులు



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న క్రిస్టియన్ మైనారిటీ ప్రతినిధులు

అనపర్తి: వైఎస్సార్‌సీపీ అనపర్తి మండల, అనుబంధ కమిటీ కార్యవర్గ కమిటీల్లో వివిధ హోదాల్లో నూతనంగా నియమితులైన కమిటీ కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల, అనుబంధ కమిటీలను ఎమ్మెల్యే మంగళవారం ప్రకటించిన విషయం విదితమే. దీంతో పార్టీ మండల యువజన, చేనేత విభాగం, క్రిస్టియన్ మైనారిటీ కమిటీల్లో పదవులు పొందిన పలువురు ఎమ్మెల్యేను కలిసి తమకు పదవులు కల్పించినందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పడాల విజయ్‌రెడ్డి, బొడ్డు సుబ్రహ్మణ్యం, జి.అమృతరావు, టి.మదన్, జ్యోతిబాబు, ఎ.దావీదు తదితరులు పాల్గొన్నారు.

అభిమాన నేతను కలుసుకున్న వేళ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రేవతిరెడ్డి

అనపర్తి: నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కొంకుదురు ఎంపీటీసీ సభ్యుడు నల్లమిల్లి అమ్మిరెడ్డి కుమార్తె రేవతిరెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తన కుటుంబ సభ్యులతో కలిసి కలుసుకుంది. ముఖ్యమంత్రి అయిన తరువాత సీఎం జగనన్నను కలుసుకోవాలన్న తన కుమార్తె కోరికను అమ్మిరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే చొరవతో అమరావతిలోని అసెంబ్లీ లాబీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రేవతిరెడ్డి బుధవారం కలిసింది. ఈ సందర్భంగా పాదయాత్ర సమయంలో కలిసిన ఫొటోలను సీఎంకు ఆమె చూపించింది. అవి చూసిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఆమెతో ఆత్మీయంగా మాట్లాడారు. దీనిపై రేవతిరెడ్డి స్పందిస్తూ సీఎం జగనన్నను కలవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ తన అభిమాన నేతను కలిసేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్

గోకవరం: వీరలంకపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ కేఎమ్‌వీ రాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఏప్రిల్ 23 వరకూ గడువు ఉందన్నారు. ఈ నెల 23న పాఠశాలలో ఉచితంగా ఆన్‌లైన్ చేస్తామని, ఆసక్తి ఉన్నవారు విద్యార్థిని ఆధార్, పుట్టిన తేదీ, కులం, తల్లి, తండ్రి పేర్లు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మిక ఉత్సవాలకు రూ.25 వేల అందజేత

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న శ్రీబాల త్రిపురసుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న ఆధ్యాత్మిక ఉత్సవాలకు మామిడాడకు చెందిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి రూ.25 వేలు అందించినట్లు ఆలయ అర్చకులు రమణశర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రమణశర్మ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన బాల త్రిపురసుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మాసశివరాత్రి సందర్భంగా కలశాభిషేక ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు.

గైట్ ఫార్మసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో దివీస్ ల్యాబరేటరీస్ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హాజరైన అభ్యర్థులకు సాంకేతిక, వ్యక్తిత్వ పరీక్షలు నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. ఏడు ఫార్మసీ కళాశాలల నుంచి బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన వారితో పాటు ఫైనలియర్ చదువుతున్న 110 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. దివీస్ ల్యాబ్ ప్రతినిధులు ఎ.రాజేష్, బి.తరుణ్ తేజ్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి టి.దీపక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని ఒనువులమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేదపండితుడు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల18వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 18వ తేదీ శనివారం ఉదయం 10.18 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, యంత్రస్థాపన, పూర్ణాహుతి, అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. కాగా.. గురువారం విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, అఖండ దీపారాధన, శుక్రవారం వాస్తుపూజ, క్షీరాభిషేకం, జలాధివాసం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా దత్తసాయి వార్షికోత్సవం



దత్తసాయికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట దేవిగుడి సెంటర్‌లో ఉన్న దత్తసాయి ఆలయ 6వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తుట్టగుంట శ్రీనివాసశర్మ, నారాయణశర్మల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉండవల్లి జానకిరామ సుబ్బారావు, సుజాత దంపతులు బాబా విగ్రహానికి పంచామృతాలు, పండ్ల రసాలతో సహస్ర నామార్చన చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన, రాత్రి సామూహిక భజనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, వుండవల్లి సత్యనారాయణ, మేడిశెట్టి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.